


వ్యక్తి దారుణ హత్య
నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇప్పలగూడెం గ్రామంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. - 8లో



పోచంపల్లిలో యూనివర్సిటీ
భూదాన్‌పోచంపల్లిలో నైపుణ్య యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. - 10లో



ప్రకృతి వ్యవసాయంతో భూసారం
ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూసారం పెరుగుతుందని గడ్డిపల్లి కేవీకే సీనియర్ శాస్త్రవేత్త నరేష్ అన్నారు. - 10లో

నీళ్లులేక.. నెర్రెలు

- భూగర్భ జలాలు అడుగంటి వట్టిపోతున్న బోర్లు
- పొట్ట దశలో ఎండిపోతున్న వరి పొలాలు
- పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతుల ఆవేదన
- సాగర్ నీటితో చెరువులు నింపాలని వేడుకోలు



ఈ ఫొటోలోని రైతు మిర్యాలగూడ మండలం జేత్యాతండాకు చెందిన బాలకోటి. ఈ రైతు బోర్ల ఆధారంగా ఏడెకరాల్లో వరి పంట సాగు చేశాడు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోవడంతో సగం పంట ఎండిపోయింది. ఇప్పటికే ఎకరాకు రూ.20వేల పెట్టుబడి పెట్టాడు. పంటను కాపాడుకునేందుకు మరో నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు రాలేదు. సుమారు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశాడు. ప్రస్తుత పరిస్థితిలో సాగర్ నీటితో చెరువులు నింపితే భూగర్భజలాలు పెరిగి మిగిలిన కొద్దిపాటి పంట చేతికొచ్చే అవకాశం ఉంది. ఇదీ సాగర్ ఆయకట్టులో వరి సాగు చేసిన రైతుల పరిస్థితి.



వేములపల్లి మండలంలో నీళ్లు లేక నెర్రెలు వారిన వరి చేను

మిర్యాలగూడ : నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఈ ఏడాది కలిసి రాలేదు. తీవ్ర వర్షాభావం కారణంగా ఈ ప్రాంతంలో కరువు ఛాయలు అలుముకున్నాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడంతో సాగర్ ప్రాజెక్టుకు వరద రాకపోవడంతో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. ఆయకట్టులో బోర్లు, బావులు ఆధారంగా కొందరు రైతుల వరి సాగు చేశారు. ఆ పొలాలు ఇప్పుడు పొట్ట దశలో ఉన్నారు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు వట్టిపోతున్నాయి. వరి చేలకు నీరు సక్రమంగా అందక ఎండిపోతున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు వచ్చే వేసవిలో తాగు నీటి కష్టాలు కూడా తప్పేలా కనిపించడం లేదు. ప్రస్తుతం సాగర్ నీటితో చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరిగి పంటలు చేతికిరావడంతోపాటు.. తాగు నీటి ఇబ్బందులు కూడా తీరే అవకాశం ఉంది.

తాగునీటి అవసరాలకే..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రధానంగా సాగర్ ఎడమకాల్వ, ఏఎమ్మార్పీ, వరద కాల్వ కింద రైతులు ఎక్కువగా వరి సాగు చేస్తారు. ఈసారి సాగుకు నీటిని విడుదల చేయకపోవడంతో కేవలం బోర్లు, బావుల ఆధారంగా సాగు చేపట్టారు. గతంలో సాగర్‌లో 520 అడుగుల నీటిమట్టం ఉంటే మొదటి జోన్ వరకైనా ఆరుతటి పంటలకు నీరిచ్చేవారు. ప్రస్తుతం తాగునీటి అవసరాలు పెరగడంతో ఆ స్థాయిలో నీరున్నా సాగు నీటి అవసరాలకు విడుదల చేయడం లేదు. కేవలం తాగు నీటికి మాత్రమే వాడుతున్నారు. రెండు రోజుల క్రితం నుంచి సాగర్ ఎడమ కాల్వ ద్వారా ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తున్నారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని చెరువులు కూడా నింపాలని ఈ ప్రాంత రైతులు, ప్రజలు కోరుతున్నారు. 2004లో సాగర్ ప్రాజెక్టులో 505 అడుగుల నీటి మట్టం ఉన్న సమయంలో కూడా మొదటి జోన్ వరకు నీటిని విడుదల చేసి చెరువులు కుంటలను నింపారు. దాని ఫలితంగా ఎండిపోయే దశలో ఉన్న పంటలు చేతికందడంతోపాటు భూగర్భ జలాలు పెరిగి తాగునీటికి కష్టం రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఆ దిశగా ఆలోచన చేయడం లేదని రైతులు పేర్కొంటున్నారు.

నీటి కోసం రైతుల ఆందోళనలు

ఇప్పటికే సాగునీటి కష్టాలను ఎదుర్కొంటున్న రైతులు రాబోయే వేసవిలో తాగునీటి కష్టాలను కూడా ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఎండుతున్న పంటలను కాపాడాలని, తాగు నీటికష్టాలు తీర్చాలని ఇప్పటికే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ముఖ్యమంత్రి, జిల్లా మంత్రులను కలిసి నీటిని విడుదల చేయాలని కోరారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి నీటిని విడుదల చేయాలని కోరారు.

“ బోర్లు పోయడం లేదు



నాకు ఐదెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఎప్పుడూ వరిసాగే చేస్తాను. భూగర్భజలాలు తగ్గడంతో బోర్లు ఎండిపోయాయి. ప్రసుతం పంట పొట్టదశలో ఉంది. బోర్లు పోయకపోవడంతో మూడెకరాల చేను నెర్రెలు వారింది. ప్రభుత్వం చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి.

– మాలోతు పాండు, రైతు, జేత్యాతండా, మిర్యాలగూడ మండలం

“ నీటి కష్టాలు తీర్చాలి



నేను మూడెకరాల్లో వరి సాగు చేశాను. ఎకరాకు రూ.20వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. మరో రెండు బోర్లు వేసినా నీళ్లు పడలేదు. వేసిన పంట ఎండిపోతోంది. ప్రభుత్వం సాగర్ నీటితో చెరువులు నింపి భూగర్భ జలాలు పెంచితే కొద్దిపాటి పంట అయినా చేతికొస్తుంది.

పెరుమాళ్ల నాగయ్య, రైతు, ఆమనగల్లు, వేములపల్లి మండలం

“ నీరు అందించేందుకు కృషిచేస్తా



సాగర్ ఎడమకాల్వ పరిధిలోని రైతులకు సాగు నీరు అందించేందుకు కృషి చేస్తాను. సాగునీటి విషయంలో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులకు వినతిపత్రం అందజేశాను. ఇక్కడి నీటి ఇబ్బందులను, ఎండుతున్న పొలాల తీరును వివరించాను. కనీసం మొదటి జోన్ వరకైనా నీరందించాలని కోరాను.

– బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, మిర్యాలగూడ

న్యూస్‌రీల్

దివ్యాంగులకు ఆటల పోటీలు

నల్లగొండ : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 5, 6 తేదీల్లో నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహిస్తామని మహిళా శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 – 16 సంవత్సరాల వయసు, 17 – 35 సంవత్సరాల వయసు గల దివ్యాంగులు ఆటల్లో పాల్గొనాలని కోరారు. పోటీలో పాల్గొనాలనుకునే దివ్యాంగులు ఈ నెల 5వ తేదీన మేకల అభినవ్ స్టేడియంలో రిపోర్ట్ చేయాలని ఆమె సూచించారు.

విద్యార్థినుల కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండటౌన్ : ఫిబ్రవరి 10,11 తేదీల్లో నల్లగొండలోని బీసీ బాలికల వసతి గృహంలో జరిగే తెలంగాణ రాష్ట్ర బాలికల కన్వెన్షన్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుంచం కావ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బాలికల వసతి గృహంలో రాష్ట్ర కన్వెన్షన్ కరపత్రాన్ని ఆమె విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులపై జరిగే దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలు, బాలికలు, విద్యార్థినుల రక్షణ కోసం పటిష్టమైన చట్టాలను తేవాలన్నారు. ఈ కన్వెన్షన్‌కు ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత బాలికల కన్వీనర్ దీప్తి తాదార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. కార్యక్రమంలో హాస్టల్ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మి, జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్, సాయి, బాలకృష్ణ, సౌజన్య, కల్పన, రాధిక, అంజలి, స్వాతి, కావ్య, మాధవి, దేవి, రేణుక పాల్గొన్నారు.

రేషన్ షాపులు తెరిచి ఉంచాలి

నల్లగొండ : జిల్లాలోని అన్ని రేషన్‌షాపులు విధిగా తెరవడంతోపాటు ప్రతిరోజూ లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో రేషన్ డీలర్లను ఆదేశించారు. అదే విధంగా ఈకేవైసీ 72 శాతం పూర్తయిందని మిగిలిన 28 శాతం కూడా పూర్తి చేయాలని సూచించారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ

కట్టంగూర్ : పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈఓ భిక్షపతి పేర్కొన్నారు. శనివారం కట్టంగూర్ మండలంలోని ఈదులూరు, మునుకుంట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్ట్‌ల వారీగా సందేహాలను నివృత్తి చేయాలన్నారు. మునుకుంట్లలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వాణి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.


కట్టడాల కూల్చివేతకు రంగం సిద్ధం

సాక్షి ఎఫెక్ట్..

చింతపల్లి : మండల కేంద్రంలోని సర్వే నంబర్ 154లో పునరావాస కేంద్రానికి కేటాయించిన అసైన్డ్ భూమిలో వెలసిన కట్టడాల కూల్చివేతకు రెవెన్యూ అధికారులు రంగం సిద్ధం చేశారు. హైదరాబాద్–నాగార్జున సాగర్ రాష్ట్ర రహదారి పక్కనే సర్వే నంబర్ 154లో కొంతమంది రైతులు భూములు విక్రయించగా గుట్టు చప్పుడు కాకుండా కట్టడాలు కూడా చేపట్టడంతో శనివారం సాక్షిలో 'అమ్మకానికి అసైన్డ్' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన జిల్లా రెవెన్యూ అధికారులు కూల్చివేతకు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఆ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన కొనుగోలుదారులు ఇప్పటికే భూములు రైతులకు అప్పజెప్పి తమ డబ్బులు వెనక్కి తీసుకునేందుకు సిద్ధపడుతున్నారు. కాగా.. సర్వే నంబర్ 154లోని భూములను క్రయ విక్రయాలు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. భూములు విక్రయించిన రైతులకు నోటీసులు కూడా జారీ చేశారు.

ఈజీఎస్ సిబ్బందికి తీపికబురు

- పేస్కేల్ అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన
- జిల్లాలో 280 మందికి లబ్ధి



నల్లగొండ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులకు ప్రభుత్వ తీపి కబురు అందించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఇంద్రవెల్లి బహిరంగ సభలో ఉపాధి హామీ సిబ్బందికి పేస్కేల్ అమలు చేస్తామని ప్రకటించడంతో ఉద్యోగుల్లో ఆనందం నెలకొంది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 280 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

18 ఏళ్లుగా ఉద్యోగ భద్రత లేకుండా..

ఉపాధి హామీలో 18 ఏళ్ల క్రితం నుంచి వివిధ కేటగిరిల్లో పలువురు ఉద్యోగ భద్రత లేకుండా పని చేస్తున్నారు. తమకు పేస్కేల్ వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేస్కేల్ వర్తింపజేసేందుకు ఫైల్‌ను ఆర్థిక శాఖకు పంపింది. ఎన్నికలు రావడం ఆ ఫైల్ చివరి క్షణంలో ఆగిపోయింది. దీంతో ఆ ఉద్యోగులంతా ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. వారికి పేస్కేల్ వర్తింపజేస్తామని అక్కడే హామీ ఇవ్వడంతో పాటు బహిరంగ సభలోనూ ప్రకటించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆశాఖ ఉద్యోగులందరికీ మేలు జరుగనుంది. పేస్కేల్ వర్తింపజేస్తే ఈ ఉద్యోగులకు ప్రతి నెల ఈ కుబేర్ ద్వారా వేతనాలు అందడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే పీఆర్‌సీ కూడా వర్తించనుంది.

జిల్లాలో ఉపాధి హామీ సిబ్బంది ఇలా..

ఏపీడీ 1, అడిషనల్ పీఓ 26, సీడీసీఎల్‌ఆర్‌సీ 2, సీఓ అండ్ ఏఏ 70, ఈసీ 27, మేనేజర్ డీబీటీ 1, ప్లాంటేషన్ మేనేజర్ 1, ప్లాంటేషన్ సూపర్‌వైజర్లు 2, టీఏలు 150 మంది పని చేస్తున్నారు.

పనుల్లో నాణ్యత లేకుంటే కఠిన చర్యలు



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు

- ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ సతీష్

మిర్యాలగూడ : రోడ్డు పనుల్లో నాణ్యత లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ అడ్మినిస్ట్రేటివ్ సీఈ పి.సతీష్ హెచ్చరించారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో కోదాడ– జడ్చర్ల నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. బిట్స్ వన్, లోతు, డాంబర్ వాడకంపై శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నాణ్యత విషయంలో రాజీ పడేది లేదన్నారు. ఇటీవల సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ నియోజకవర్గంలో వెలదండ– మునగాల రోడ్డు పరిశీలించగా నాణ్యత లేదని తేలిందని, ఆ కాంట్రాక్టర్‌తో మళ్లీ నాణ్యతతో రోడ్డు వేయించామన్నారు. మిర్యాలగూడ పట్టణంలో నేషనల్ హైవే కింద రూ.13 కోట్లు మంజూరు కాగా రూ.9కోట్లతో 1.5 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మించామని తెలిపారు. డివైడర్‌కు ఇరువైపులా 35ఫీట్ల రోడ్డు నిర్మిస్తున్నామని ఆ తరువాత ఫుట్‌పాత్, వీధిలైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. నల్లగొండలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించామని, భువనగిరిలో కలెక్టరేట్ నిర్మించామని తెలిపారు. వీటి నిర్మాణంలో నాణ్యతలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ పుల్లాదాసు, ఈఈ శ్రీనివాస్‌కుమార్, నేషనల్ హైవే ఈఈ యుగంధర్, డీఈ నరసింహారావు, నేషనల్ హైవే డీఈ బాలునాయక్, జేఈ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నీటిపై బీఆర్‌ఎస్ పోరుబాట

- 'చలో నల్లగొండ' నిర్వహణకు కసరత్తు
- పాల్గొననున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్!

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కృష్ణా నీటిపై బీఆర్‌ఎస్ పోరుబాట చేపడుతోంది. కృష్ణా జలాల్లో వాటాలు తేల్చాలని డిమాండ్ చేస్తూ చలో నల్లగొండకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. కృష్ణా జలాలకు సంబంధించి సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీ పరిధిలోకి తీసుకోవడం, అంతకుముందు ఆంధ్రా అధికారులు అనుమతి లేకుండా నీటిని విడుదల చేసుకోవడం వంటి పరిణామాలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో త్వరలో చలో నల్లగొండ కార్యక్రమం నిర్వహించాలని బీఆర్‌ఎస్ పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు అధిష్టానం సమాచారం అందించినట్లు సమాచారం. త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణ వెలువడనుందని తెలిసింది. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర నేతలు హాజరు కానున్నట్లు తెలిసింది.

నల్లగొండ బరిలో కోమటిరెడ్డి కూతురు!

- శ్రీనిధి రెడ్డి పోటీ చేస్తారని ప్రచారం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూతురు శ్రీనిధిరెడ్డి పోటీ చేయనున్నట్లు తెలిసింది. ఇటీవల ఏఐసీసీ.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోటీలో ఎవరైతే బాగుంటుంది అనే విషయంపై ఏఐసీసీ సర్వేలు చేయించినట్లు సమాచారం. ఈ సర్వేల్లో మంత్రి కోమటిరెడ్డి కూతురు శ్రీనిధిరెడ్డి వైపు కూడా ప్రజలు మొగ్గు చూపినట్లు తెలిసింది. దీంతో అనూహ్యంగా శ్రీనిధిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. ఇప్పటికే నల్లగొండ ఎంపీ టికెట్ కోసం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు కుందూరు జయవీర్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులు కూడా ఆయనకే ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో సూర్యాపేట టికెట్ విషయంలో రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, పటేల్ రమేష్‌రెడ్డి పోటీ పడ్డారు. టికెట్ దామోదర్‌రెడ్డికి దక్కడంతో పటేల్ రమేష్‌రెడ్డి వర్గమంతా ఆందోళనకు దిగింది. అసెంబ్లీ బరిలో తాను కూడా ఉంటానని రమేష్‌రెడ్డి ప్రకటించడంతో కాంగ్రెస్ అధిష్టానం నల్లగొండ లోక్‌సభ టికెట్ ఇస్తామని ఆయనకు సర్దిచెప్పింది. ప్రస్తుతం ఆయన కూడా లోక్‌సభకు పోటీ చేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ పరిస్థితుల్లో తాజాగా శ్రీనిధిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. అమెరికాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చేసిన శ్రీనిధిరెడ్డి తన తండ్రి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. అయితే ఇప్పటివరకు ఆమె ఎంపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకోలేదు.

ప్రాక్టికల్స్‌కు 227 మంది గైర్హాజర్

నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షకు 227 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ దస్రూనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 3006 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావల్సి ఉండగా 2,779 మంది హాజరయ్యారు. వారిలో జనరల్‌లో 1422 మందికి 1389 మంది, ఒకేషనల్‌లో 1584 మందికి 1390 మంది హాజరయ్యారు. జనరల్‌లో 33 మంది, ఒకేషనల్‌లో 194 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

ముగ్గురు అధికారులపై వేటు

డిండి : ప్రాక్టికల్స్ పరీక్షకు గైర్హాజరైన వారికి కూడా మార్కులు వేశారన్న ఫిర్యాదులతో ముగ్గురు అధికారులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఐఈఓ దస్రూనాయక్ శనివారం తెలిపారు. డిండిలోని శ్రీ వేంకటేశ్వర ఒకేషనల్ కాలేజీలో ఈనెల 1వ తేదీన ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో పలువురు విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు గైర్హాజరైనా వారికి కూడా మార్కులు వేస్తున్నారని డీఐఈఓకు పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై శనివారం డిస్ట్రిక్ట్ ఎగ్జామినర్, కమిషన్ సభ్యులు ధన్‌రాజ్, శ్రీనివాస్ పరీక్ష కేంద్రానికి వచ్చి విచారణ చేపట్టారు. విచారణ నివేదిక డీఐఈఓకు అందజేశారు. ఇందుకు కారణమైన కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం, డీఓ సాయిలు, ఎగ్జామినర్ సక్రునాయక్‌ను ఈ ప్రాక్టికల్స్ విధుల నుంచి తప్పిస్తూ డీఐఈఓ నిర్ణయం తీసుకున్నారు. వీరి స్థానంలో వేరేవారిని నియమించారు. తదుపరి చర్యల నిమిత్తం హైపవర్ కమిటీకి నివేదికను పంపారు.

ముఖ్యమంత్రికి విద్యార్థుల ఉత్తరాలు



సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన ఉత్తరాలను చూపిస్తున్న విద్యార్థులు

డిండి : మండల పరిధిలోని తవక్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ పాఠశాల విద్యార్థులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాశారు. పాఠశాలలో మొత్తం 110 విద్యార్థులకుగాను ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, తాగునీటి సమస్య ఉందని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి బస్సు సౌకర్యం కల్పించాలని ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాసినట్లు పాఠశాల హెచ్‌ఎం రాజేందర్‌రెడ్డి తెలిపారు.

బాధ్యతతో పనిచేసేలా చూస్తాం

- అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



పాల్గొన్న అదనపుకలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అధికారులు

నల్లగొండ : గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యతతో పని చేసేలా చూస్తామని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ సీతక్క, రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ హనుమంతరావుతో కలిసి ములుగు జిల్లా నుంచి పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించామని తెలిపారు. వారికి శిక్షణ ఇచ్చి ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే తనిఖీలు : ఎస్పీ



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌లు

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణ కోసమే నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ చందనాదీప్తి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి జిల్లా కోర్టు శనివారం జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 44 మందిని కోర్టులో హాజరు పర్చగా ఒకరికి రెండు రోజులు, ముగ్గురికి ఒక రోజు జైలు శిక్ష విధించగా.. 40 మందికి మొత్తం రూ.34 వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు. వీరందరికి ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాలు జరిగే తీరుపై ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ డానియల్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

- పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి, పాల్గొన్న పార్టీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ సీట్లలో బీజేపీదే గెలుపు అని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ బలమైన శక్తిగా ఎదుగుతోందన్నారు. మోదీ ప్రధానమంత్రి అయ్యాక దేశం సుభిక్షంగా ఉందని, మూడోసారి కూడా ప్రధానమంత్రి కావడం ఖాయమని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు ఇండియా కూటమి ఏర్పాటు చేసుకుని వారి సొంత రాష్ట్రాల్లో డిపాజిట్లు కోల్పోయాయని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని, మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ప్రభారి చాడ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, కళ్యాణ్‌నాయక్, సాధినేని శ్రీనివాసరావు, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, దోనూరు వీరారెడ్డి, మోగులయ్య, కంకణాల నివేదిత, పోతెపాక సాంబయ్య, నిమ్మల రాజశేఖర్‌రెడ్డి, పెరిక మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా ఉద్యోగి నిరసన



ఎన్ఎస్పీ ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పావని

మిర్యాలగూడ: ఎన్ఎస్పీ ఎస్ఈ కార్యాలయంలోని ఓ అధికారి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తూ జూనియర్ అసిస్టెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపింది. జూనియర్ అసిస్టెంట్ పావని శనివారం ఎన్ఎస్పీ క్యాంపులోని కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసింది. రెండేండ్ల క్రితం తాను విధుల్లో చేరినప్పటి నుంచి అన్ని విభాగాల పనులను తనతో చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు కేటాయించిన పనులను మాత్రమే చేస్తానంటే సెలవులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయింది.

చింతచెట్టు పైనుంచి పడి మృతి

ఆత్మకూరు(ఎం): చింత చెట్టు పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఇప్పల్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఇప్పల్లకు చెందిన నాగుల రామకృష్ణయ్య(70) చింత కాయలు తెంపుదామని చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారిపడ్డాడు. క్షతగాత్రుడిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి కెహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.

ఇప్పలగూడెంలో వ్యక్తి దారుణ హత్య

- హతుడి తలపై పదునైన ఆయుధంతో పొడిచినట్లు ఆనవాళ్లు
- వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య చేసినట్లు అనుమానాలు
- కేతేపల్లి మండలంలో దారుణం



ఘటన స్థలంలో సైదులు మృతదేహం



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం, సీఐ రాఘవరావు

కేతేపల్లి: నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఇప్పలగూడెంలో దారుణం చోటు చేసుకుంది. దుండగులు ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఇప్పలగూడెం గ్రామానికి చెందిన వంటల జానయ్య కుమారుడు వంటల సైదులు(38) ఇరవై ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన అర్చనను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు సంతానం ఉన్నారు. కొన్నాళ్ల తర్వాత వీరిద్దరి మధ్య బేదాభిప్రాయాలు రావటంతో భార్య అర్చన తన చిన్న కుమారుడు, కూతురును తీసుకుని ఎనిమిదేళ్ల క్రితం భర్త సైదులు నుంచి విడిపోయి హైదరాబాద్‌లో నివాసం ఉంటుంది. సైదులు ప్రస్తుతం తన పెద్ద కుమారుడు చందుతో కలసి గ్రామంలోనే ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో స్థానికంగా ఉన్న దుకాణం వద్ద మద్యం సేవించిన సైదులు రాత్రి పొద్దుపోయే వరకు కూడా ఇంటికి చేరుకోలేదు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లగా.. గుడివాడకు వెళ్లే దారిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ఆవరణలో రక్తపు మడుగులో ఉన్న సైదులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు.



సైదులు (ఫైల్)

ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

శాలిగౌరారం సీఐ రాఘవరావు, కేతేపల్లి ఎస్ఐ శివతేజ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నల్లగొండ నుంచి డాగ్ స్క్వాడ్ క్లూస్‌టీంలను రప్పించి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్ గ్రామ శివారులో ఉన్న కట్ట మైసమ్మ ఆలయం వరకు వెళ్లి వచ్చినట్లు తెలుస్తుంది. మృతుని చెవిపై భాగంలో, చెంప, గదమ, ఛాతిపై బలమైన గాయాలు తగలటంతో దుండగులు పదునైన చాకుతో దాడి చేసినట్లుగా భావిస్తున్నామని సీఐ రాఘవరావు తెలిపారు. తమ తండ్రిని కొట్టి చంపారంటూ మృతుడి కుమారుడు చందు కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని పేర్కొన్నారు.

వివాహేతర సంబంధమే కారణమా?

మృతుడు వంటల సైదులు గ్రామంలో ఓ వివాహితతో కొంత కాలంగా కొనసాగిస్తున్న వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసినట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు. విషయం మహిళ ఇంట్లోని కుటుంబ సభ్యులకు తెలియటంతో వారే సైదులును హత్య చేసినట్లుగా హతుడి సన్నిహితులు, స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హత్య జరిగిన తర్వాత శనివారం ఉదయం నుంచి అనుమానిత కుటుంబ సభ్యులు ఎవరూ గ్రామంలో కనిపించక పోవటంతో ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చినట్లయింది. పోలీసులు కూడా ఈ కోణంలోనే దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈనేపథ్యంలో సదరు అనుమానిత మహిళను పోలీసులు అదుపులోకి తీసుకుని రహస్య ప్రదేశంతో విచారిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల విచారణ అనంతరం సైదులు హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి.

నేడు కొత్తగూడెంలో వర్థెల్లి రాములు సంతాప సభ

- కార్యకర్తలు, అభిమానులు తరలిరండి
- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు



వర్థెల్లి రాములు (ఫైల్)

తుంగతుర్తి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు వర్థెల్లి రాములు సంతాప సభ ఆదివారం తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెంలో నిర్వహిస్తున్నట్లు సీపీఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాయుధ పోరుకు ఆయువుపట్టుగా నిలిచిన కర్విరాల కొత్తగూడెం గ్రామంలోని సామాన్య గీత కార్మిక కుటుంబంలో జన్మించిన వర్థెల్లి రాములు 12ఏళ్ల వయసులోనే గీత కార్మికుల సమస్యలపై పోరాడారని పేర్కొన్నారు. దొరల, భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి పేదల పక్షాన నిలబడ్డారని గుర్తుచేశారు. ఎన్ని నిర్బంధాలు వచ్చినా తట్టుకుని తన అన్న బుచ్చిరాములు మార్గదర్శకంలో నికార్సయిన కమ్యూనిస్టుగా ఎదిగారని కొనియాడారు. శత్రువుల భౌతిక దాడులను సైతం ఎదుర్కొని, సీపీఎం పటిష్టానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా 1978లో తుంగతుర్తి రైతు సేవా సహకార సంఘం చైర్మన్‌గా మొట్ట మొదటగా గెలిచి సన్న చిన్నకారు రైతులకు పంట రుణాలు ఇప్పించి అన్నదాతలకు దగ్గరయ్యాడని, కర్విరాల వాటర్ షెడ్ చైర్మన్‌గా గెలిచి వరద కాలువలు, చెక్‌డ్యాంలు నిర్మించి ప్రజలు మెచ్చిన ప్రజా ప్రతినిధిగా నిలిచాడని నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. వర్థెల్లి రాములు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ జనవరి 25న తుది శ్వాస విడిచారని, రాములు స్వగ్రామం కర్విరాల కొత్తగూడెంలో ఆదివారం జరిగే సంతాప సభకు సీపీఎం శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వెంకటేశ్వర్లు కోరారు.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కార్మికశాఖలో డెత్ బీమా కొరకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఆపుతున్నారని ఓ మహిళ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సకాలంలో గుర్తించి పోలీసులు అడ్డుకోవడంతో ప్రమాదం తప్పింది. సూర్యాపేట కలెక్టరేట్‌లో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చివ్వెంల మండలం ఐలాపురం గ్రామానికి చెందిన బుడిగ నిర్మల శనివారం పెట్రోల్ బాటిల్‌తో జిల్లా కలెక్టరేట్‌కు వచ్చింది. గమనించిన పోలీస్‌లు కార్యాలయం ప్రధాన గేటు ముందే ఆమె వద్ద నుంచి పెట్రోల్ బాటిల్ లాగుకోవడంతో ప్రమాదం తప్పిది. అనంతరం బాధితురాలు అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించింది. తన మామ బుడిగ వెంకటయ్య కార్మికశాఖలో భవన నిర్మాణ కార్మికుడిగా లేబర్ కార్డు కలిగి ఉన్నాడు. అతను గత సంవత్సరం మరణించగా ఇన్సూరెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నది. అయితే సూర్యాపేట అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఇన్సూరెన్స్ అందకుండా అడ్డుపడుతున్నాడని తెలిపింది. దీనిపై స్పందించిన అదనపు కలెక్టర్ దరఖాస్తు పరిశీలించి బీమా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

కారు అద్దాలు పగులగొట్టి నగదు చోరీ

మిర్యాలగూడ అర్బన్: గుర్తుతెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడంలో శనివారం చోటు చేసుకుంది. రైస్‌మిల్లు వ్యాపారి గౌరు శ్రీనివాస్ వేములపల్లి మండల కేంద్రంలోని ఓ బ్యాంకు నుంచి రూ.2లక్షలు డ్రా చేసుకుని తన కారులో డబ్బుల బ్యాగ్‌ను పెట్టుకుని మిర్యాలగూడ పట్టణంలోని రామచంద్రగూడంలో గల ఆయన ఇంటికి చేరుకున్నాడు. తిరిగి వెంటనే వెళ్లాలనే ఉద్దేశంతో డబ్బుల బ్యాగ్‌ను కారులోనే ఉంచి తాళం వేసి ఇంట్లోకి వెళ్లాడు. పదిహేను నిమిషాల వ్యవధిలో కారువద్దకు చేరుకుని చూడగా అద్దాలు పగులకొట్టి ఉన్నాయి. కారులో చూడగా రూ.2లక్షల డబ్బులు బ్యాగ్ కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలనీలో ప్రజలకు వాకబు చేయగా రెండు బైక్‌లపై నలుగురు వ్యక్తులు వెళ్లినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ పి.వెంకటగిరి చోరీ జరిగిన ప్రాంతానికి వెళ్లి కారును పరిశీలించారు. నిందుతులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. కాగా డబ్బులు డ్రా చేస్తుండగా చూసి కారును వెంబడించి డబ్బులు కాజేశారా..? లేక పక్కా సమాచారంతో అక్కడికి చేరుకున్న దుండగులు కారు అద్దాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డారా..? అనే కోణంలో విచారణ జరుపుతున్నట్లు టూటౌన్ ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.



కారును పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటగిరి

వ్యక్తి ఆకస్మిక మృతి

వలిగొండ : ఓ వ్యక్తి ఆకస్మికంగా మృతిచెందాడు. ఈ ఘటన వలిగొండ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వలిగొండ మండల పరిధిలోని ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన రంగరాజు ఆనంద్ కుమార్ (52) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని శామీర్‌పేట మండలంలోని తుముకుంటలో నివాసం ఉంటున్నారు. ఆనందకుమార్ తల్లి ఇటీవల మరణించడంతో ఆమె అంత్యక్రియల కోసమని కుటుంబంతో సహా వలిగొండ మండల కేంద్రానికి వచ్చాడు. కొద్ది రోజుల క్రితం భార్య శిరీష, కొడుకు సాయితేజను తుముకుంటకు పంపించేశాడు. శుక్రవారం రాత్రి ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి శనివారం మృతి చెంది ఉన్నట్లు గుర్తించి మృతుడి సోదరుడు ఇచ్చిన సమాచారం ఇవ్వడంతో భార్య శిరీష వలిగొండకు చేరుకుంది. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్ లాల్ తెలిపారు.

పులినా.. హైనానా?

- రెండో రోజు కొనసాగిన అటవీ అధికారుల గాలింపు చర్యలు
- అడుగుల జాడతో హైనాగా భావిస్తున్న అధికారులు



రామన్నపేటలో గాలిస్తున్న అటవీశాఖ అధికారులు

రామన్నపేట : రామన్నపేట పరిసరాల్లో శుక్రవారం పులి సంచరించిందనే వార్త ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. గూడ్స్‌రైలు గార్డ్ పులి ట్రాక్‌ను దాటుతుంటే చూశానని రైల్వే అధికారులకు తెలుపడంతో పులి సంచరించిదనే వార్తకు బలం చేకూరింది. పోలీసు, అటవీశాఖ అధికారులు పులి సంచిరించిందని అనుమానం కలిగిన ప్రాంత పరిసర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తూ రాత్రంతా గడిపారు. కొమ్మాయిగూడేనికి చెందిన రైతు కూడా తనకు పులి కనిపించిందని తెలుపడంతో అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో ట్రాకింగ్ కెమెరాలను ఏర్పాటు చేశారు. చీకటి పడడంతో గాలింపు చర్యలను నిలిపివేశారు. శనివారం కూడా అటవీశాఖ అధికారులు పులికోసం గాలించారు. అధికారులు ఏర్పాటు చేసిన కెమెరాల్లో జంతువుల కదలికలు ఏమీ రికార్డు కాలేదు. రైతు తనకు పులి కనిపించిందని చెప్పిన ప్రదేశంలో అడుగులను పరిశీలించారు. అధికారులు గుర్తించిన అడుగుల్లో గోర్ల ఆనవాళ్లు ఉన్నాయి. కాబట్టి కుక్కజాతికి చెందిన హైనా సంచరించి ఉంటుందని, పులిని పోలి ఉండే హైనాను చూసి రైల్వేగార్డ్, రైతు పులిగా భావించి ఉంటారని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. పిల్లి జాతికి చెందిన పులి కూడా గోర్లు కలిగి ఉంటుందని అవసరమైన సమయంలోనే అంటే ఇతర జంతువులు, మనుషులపై దాడి చేసే సమయంలోనే గోర్లు బయటకు వస్తాయని, సాధారణంగా పులి నడిచేటప్పుడు గోర్లు బయటకు రావనేది అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రామన్నపేట పరిసరాల్లో సంచిరించింది పులిని పోలిన హైనా అయి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. శుక్ర, శనివారాల్లో జంతువులు, మనుషుల మీద దాడిచేయడం వంటి సంఘటనలు చోటు చేసుకోక పోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

హడలెత్తించిన సోషల్ మీడియా

సోషల్‌మీడియాలో వచ్చిన పలు వీడియోలు ప్రజలను మరింత భయ భ్రాంతులకు గురి చేశాయి. అడవిలోని బాటగుండా పులి నడుచుకుంటూ వెళ్తున్నట్లు ఉన్న వీడియో, గేదెలను చంపినట్లు ఉన్న ఫొటోలు వైరల్ కావడంతో ప్రజలు హడలెత్తిపోయారు. ప్రజలను సందేహాలను నివృత్తి చేయడానికి పోలీసు అధికారులు నానా తంటాలు పడ్డారు.

కారు బోల్తా.. నలుగురికి తీవ్ర గాయాలు



ధ్వంసమైన కారు

మోత్కూరు : కారు అదుపుతప్పి బోల్తా పడడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జామచెట్లబావి ఎక్స్ రోడ్డు వద్ద శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. 108 వాహనం ఈఎంటీ తొంట భాస్కర్, పైలట్ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి, ముద్దారం గ్రామాలకు చెందిన శ్రీకాంత్‌రెడ్డి, మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన రాజు, రామన్నపేట మండలం దుబ్బాకకు చెందిన రంజిత్‌రెడ్డి, సూర్యాపేటకు చెందిన అశోక్‌లు జనగామ నుంచి కారులో వస్తున్నారు. మోత్కూరు మున్సిపల్ పరిధిలోని జామచెట్లబావి ఎక్స్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి కారు అదుపు తప్పి బోల్తాకొట్టింది. దీంతో కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

లారీ, ట్రాక్టర్ ఢీ.. పలువురికి గాయాలు



గాయపడిన మహిళా కూలీ

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : లారీ, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీ కొనడంతో పలువురు కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్లు శివారులో శనివారం చోటుచేసుకున్నది. మట్టిలోడుతో దంతాలపల్లి నుంచి సూర్యాపేట వైపు వస్తున్న లారీ నెమ్మికల్లు నుంచి కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్‌ను నంద్యాలగూడెం స్టేజీ సమీపంలో ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నెమ్మికల్లుకు చెందిన పలువురు మహిళా కూలీలు దండుగుల లక్ష్మి, మద్ది మమత, కొడిదల వెంకటమ్మ, వీరమోయిన ఐలమ్మ, మానుపురి అలివేలులతో పాటు పలువురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై సాయంత్రం వరకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గ్యాస్ సిలిండర్‌లో నీళ్లు

భూదాన్‌పోచంపల్లి : ఎల్‌పీజీ సిలిండర్‌లో నుంచి నీళ్లు బయటివచ్చిన ఘటన శనివారం జలాల్‌పురంలో చోటు చేసుకొంది. బాధితుడు కొయ్యడ కాశీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. వినియోగదారుడు పోచంపల్లిలోని ఇండియన్ గ్యాస్‌ను వినియోగిస్తున్నాడు. ఉదయం వంట చేయడానికి గ్యాస్ పొయ్యి వెలిగిస్తే మంట రాలేదు. గ్యాస్ అయిపోయిందని భావించి సిలిండర్ మారుద్దామని చూడగా సిలిండర్ బరువుగా ఉంది. కదిపితే చూస్తే ద్రవం వలె శబ్దం వచ్చింది. దాంతో అనుమానం వచ్చి సిలిండర్‌ను తలకిందులుగా చేయగా అందులో నుంచి సుమారు 3 లీటర్ల నీళ్లు వచ్చాయి. ఇదే విషయమై స్థానిక ధర్మశాస్త్ర గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులకు ఫోన్ చేసి తెలుపగా తమకు సంబంధంలేదని, కంపనీ నుంచి వచ్చిన సిలిండర్‌లనే వినియోగదారులకు సరఫరా చేస్తున్నామని చెప్పాడని వినియోగదారుడు వాపోయాడు. అయితే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు నాగేశ్ జరిగిన ఘటనపై వివరణ ఇస్తూ సిలిండర్‌లో గ్యాస్‌నింపే క్రమంలో ఒక్కోసారి అరుదుగా ఇలా జరుగుతుందని అన్నారు. సిలిండర్ తీసుకొచ్చి ఇస్తే దానికి బదులు మరో సిలిండర్‌ను ఇస్తామని పేర్కొన్నాడు.

విహారం.. విషాదాంతం

- సాగర్ వెనుక జలాల్లో మునిగి యువకుడి మృతి

చందంపేట : స్నేహితుల విహారయాత్ర చివరకు విషాదాంతంగా ముగిసింది. నాగార్జున సాగర్ వెనుక జలాల్లో మునిగి ఓ యువకుడు మృతిచెందాడు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం వైజాక్ కాలనీలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం, ఉప్పునూతల మండలం గువ్వలోనిపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి పృథ్వీ (20) కొంతకాలంగా హైదరాబాద్‌లోని చంపాపేట ప్రాంతం సింగరేణి కాలనీలో నివాసం ఉంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం పృథ్వీ తన నలుగురు స్నేహితులతో కలిసి నేరేడుగొమ్ము మండలం వైజాక్ కాలనీకి విహారయత్రకు వచ్చాడు. మద్యం సేవించిన తర్వాత సాగర్ వెనుక జలాల్లో ఈత కొట్టేందుకు వెళ్లారు. పృథ్వీకి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు అతడిని ఒడ్డుకు చేర్చి దేవరకొండ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి



యాకూబ్ (ఫైల్)

నల్లగొండ క్రైం : అదృశ్యమైన వృద్ధుడు మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని శనివారం టూటౌన్ పోలీసులు గుర్తించారు. నల్లగొండ పట్టణం మిర్యాలగూడ రోడ్డులోని హైటెక్ కాలనీలో నివాసం ఉంటున్న రేవూరి యాకూబ్ (78) జనవరి 25న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. మతి స్థిమితం కారణంగా ఇంటి నుంచి కొద్ది దూరంలో అనేక సార్లు తిరిగి పడి పోవడంతో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా విచారించి కుటుంబ సభ్యులకు తెలియ జేశారు. డీఆర్‌డీఏలో సూపరింటెండ్‌గా పనిచేస్తున్న మృతుడి కుమార్తె రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

భూదాన్‌పోచంపల్లి : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సంఘటన శనివారం రాత్రి గౌస్‌కొండ సమీపంలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం కైతాపురం గ్రామానికి చెందిన కందగట్ల జంగారెడ్డి(38) వ్యక్తిగత పనిమీద బైక్‌పై పోచంపల్లి నుంచి భట్టుగూడెం వైపు వెళ్తున్న క్రమంలో గౌస్‌కొండ నుంచి పోచంపల్లికి గడ్డిలోడుతో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ ముందు లైట్లు వేసుకోకుండా వస్తున్నాడు. ఈ క్రమంలో గౌస్‌కొండ గ్రామశివారులో చీకట్లో ట్రాక్టర్‌ను గమనించక ఎదురుగా వచ్చిన జంగారెడ్డి ట్రాక్టర్‌ను బలంగా ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో జంగారెడ్డి తలకు తీవ్రగాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులు సమాచారం ఇవ్వగా వారు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. అనంతరం తీవ్రంగా గాయపడిన జంగారెడ్డిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రాక్టర్‌డ్రైవర్ ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు. అనంతరం పోలీసులు ట్రాక్టర్, ప్రమాదానికి గురైన బైక్‌ను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- యాదాద్రి కలెక్టర్ హనుమంతు కే.జెండగే

సాక్షి,యాదాద్రి : ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాల కలెక్టర్ హనుమంతు కే.జెండగే సూచించారు. టెన్త్‌కు మార్చి 18నుంచి జరగనున్న వార్షిక పరీక్షల నేపథ్యంలో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి జీవితంలో పదవ తరగతి ముఖ్యమైన ఘట్టం అని, వారికి సరైన మార్గదర్శనం చేయడం మన బాధ్యత అన్నారు. పరీక్షల సన్నద్ధతకు ప్రధానోపాధ్యాయులు రూపొందించిన యాక్షన్ ప్లాన్‌ను అంతే శ్రద్ధతో విద్యార్థులతో చేయించాలని చేయించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. అచార్య కూరెళ్ల విఠలాచార్యకు పద్మశ్రీ పురస్కారం రావడం ఎంతో గర్వకారణమన్నారు.

ముదిమాణిక్యం మేజర్ వద్ద ఉద్రిక్తత

నిడమనూరు: మండలంలోని ముదిమాణిక్యం మేజర్ వద్ద శనివారం రాత్రి రైతులు మేజర్ షట్టర్ ఎత్తే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత నెలకొన్నది. సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేసి ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్‌కు తరలిస్తున్నారు. మండలంలోని ముదిమాణిక్యం మేజర్ పరిధిలో నాటు వేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు శనివారం సాయంత్రం చీకటి పడగానే మేజర్ షట్టర్‌ను కొంత మేరకు ఎత్తారు. షట్టర్‌లను పూర్తిగా ఎత్తి నీటిని విడుదల చేయాలని అక్కడే ఉన్న ఎన్ఎస్పీ డీఈ శ్రీనివాస్‌రెడ్డిని అడిగినా అనుమతి లేనందున చేయలేమన్నారు. దీంతో రైతులు షట్టర్ ఎత్తి నీటిని విడుదల చేసుకుంటామని ఎన్ఎస్పీ అధికారులు, లస్కర్‌లతో వాదనకు దిగారు. అధికారులు నిడమనూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏఎస్ఐ జోజి ఆధ్వర్యంలో పోలీసులు రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అనుమతి లేకుండా షట్టర్ ఎత్తవద్దని, సమస్యలు తేవద్దని వారు రైతులను కోరారు. అయినా రైతులు వినకుండా పొలాలు ఎండిపోతున్నాయని, నీరు విడుదల చేయాల్సిందే అని పట్టుబట్టారు. మేజర్‌ల వద్ద పోలీసులు, లస్కర్‌లు కాపలాగా ఉన్నారు. నిడమనూరు మండలంలోని నారమ్మగూడెం, రేగులగడ్డ, తుమ్మడం, అడవిదేవులపల్లి మండలం ఉల్సాయిపాలెం రైతులు మేజర్ వద్దకు వచ్చిన వారిలో ఉన్నారు. నిడమనూరు మండలం రైతులు వెనుదిరగగా, అడవిదేవుల పల్లికి చెందిన రైతులు అక్కడే ఉండి అధికారులతో వాదనలు చేస్తూనే ఉన్నారు.

రైతులు ఏడుస్తున్నారు

వరి పొలాలు ఎండిపోతున్నాయని రైతులు కంటతడి పెడుతున్నారు. మెయిన్ కెనాల్‌లో నీళ్ల తీసుకుపోతూ మేజర్ కాలువలకు విడుదల చేయకపోతే ఊరుకునేది లేదు. రైతులను ఇబ్బంది పెట్టకుండా నీటి విడుదల చేయాలి.

– గడ్డం గోవింద రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్, నిడమనూరు

భువనగిరిలో విషాదం



విద్యార్థినుల మృతి ఘటనపై వార్డెన్‌ను విచారిస్తున్న డీఈజీ, పోలీసులు



ఆసుపత్రిలో మీడియాతో మాట్లాడుతున్న భువనగిరి డీఈజీ నారాయణ రెడ్డి



ఆసుపత్రిలో రోదిస్తున్న భవ్య తల్లి



ఆసుపత్రిలో రోదిస్తున్న వైష్ణవి తల్లి